క్లుప్తంగా

మరిడమ్మతల్లికి స్వర్ణ పుష్పాలతో పూజ



బంగారు పుష్పాలతో పూజలు అందుకుంటున్న మరిడమ్మతల్లి

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి



చినబ్రహ్మదేవంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటలక్ష్మి

పెద్దాపురం: అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని ఉపాధి హామీ జిల్లా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని చినబ్రహ్మదేవంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. కూలీల శాతాన్ని పెంచి ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో ఉపాధి పనులు సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీఓ స్వామి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ ఉన్నారు.

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లు వద్దు



సామర్లకోట విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, పెంచిన విద్యుత్తు చార్జీలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ గడిచిన ఏడాది లోటు బడ్జెట్‌ను ప్రభుత్వమే భరించాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్వత్సభ వార్షికోత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో శనివారం నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు సంగీత విద్వత్సభ 75 వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్టు సభ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ శుక్రవారం తెలిపారు. 21న సీత, నిత్యల భరత నాట్యం, 22న తోప్పూర్ సాయిరాం గాత్ర కచేరి, 23న సవిత శ్రీరాం గాత్ర కచేరి, 24న అనాహిత, అపూర్వల గాత్ర కచేరి, 25న బోనాల శంకర్ ప్రకాష్ వీణ సంగీత కచేరి నిర్వహించనున్నట్టు వక్కలంక తెలిపారు. అలాగే 26న భవ్యహరి గాత్ర కచేరి, 27న మధురై శివగణేష్ గాత్ర కచేరి, 28న టీఎస్ఎస్ కృష్ణ గాత్ర కచేరి, 29న వేదాంతం రామలింగశాస్త్రి నృత్యరూపకం, 30న విజయగోపాల్ వేణు గానామృతం సంగీత కచేరి నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

24న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 24న అపోలో ఫార్మసీ, జియో ఫైబర్ నందు పనిచేయడానికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శాంతి శుక్రవారం తెలిపారు. ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీలు 30మంది, జియో ఫైబర్ ఇంజినీర్ 50 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు, పదో తరగతి నుంచి అపైన డిగ్రీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 0884–2373270 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఎయిర్ కండిషన్స్‌పై ఉచిత శిక్షణ..

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 8వ తరగతి ఉత్తీర్ణులకు ఫీల్డ్ టెక్నీషియన్ అండ్ ఏసీలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు శుక్రవారం తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి కల్పిస్తామని, ఇతర వివరాలకు 99084 43770 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

కెరీర్ గైడెన్స్‌పై రేపు కౌన్సెలింగ్

బోట్‌క్లబ్: కెరీర్ గైడెన్స్‌పై ఈ నెల 22న ఉదయం 10 గంటలకు దంటు కళాక్షేత్రంలో విద్యార్థులకు ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ప్రముఖ సైకాలజిస్ట్ జి.శశిభూషణ్ తెలిపారు. స్థానిక కరణంగారి సెంటర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు తాము స్థిరపడాలనుకున్న రంగాల్లో ఎలా ముందుకు వెళ్లాలో కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి సమితి ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు గుండ్రోజు ఉదయ భానోజీరావు పాల్గొన్నారు.

సొంతింటి కల...సాయం ఇలా!

- తక్కువ వడ్డీకే లబ్ధిదారులకు రుణాలు
- అన్ని వసతులతో జగనన్న కాలనీలు
- నియోజకవర్గంలో 12,469 స్థలాలు మంజూరు

నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు
కొత్తపల్లి	4292
గొల్లప్రోలు	2677
గొల్లప్రోలు అర్బన్	2100
పిఠాపురం	3400

కొత్తపల్లి: పేదల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుడికి రూ.1.8 లక్షలు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఇంటి నిర్మాణానికి సరిపోవనే ఉద్దేశంతో బ్యాంకర్లతో చర్చించి అదనంగా తక్కువ వడ్డీకే రుణం ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో 12,469 మందికి ఇంటి నివాస స్థలాలు మంజూరు చేశారు.

సహకారం ఇలా..

నియోజకవర్గం పరిధిలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారులకు సిమెంటు, ఇసుక, ఇనుము రాయితీపై అందించడం జరుగుతుంది. 90 బస్తాల వరకూ సిమెంటు, 20 టన్నుల ఇసుక, 343 కేజీల ఇనుము అందిస్తున్నారు.



రమణక్కపేట లే అవుట్‌లో వేగంగా జరుగుతున్న ఇంటి నిర్మాణం

మౌలిక వసతులు ఇలా..

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుంది. తాగునీటి బోర్లు, రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీలు కలిపిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే నగదుతో పాటు డ్వాక్రా సంఘం సభ్యురాలు అయి ఉంటే వారికి బ్యాంకు ద్వారా పావలా వడ్డీకి రూ.35 వేలు అందిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



అమరవిల్లిలో నిర్మించిన జగనన్న ఇల్లు

అందరూ నిర్మాణాలు చేపట్టాలి



ప్రతి లబ్ధిదారు తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకోవాలి. వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారుని వద్దకు వెళ్లి ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలి. కొమరగిరి పంచాయతీలో కాకినాడ అర్బన్‌కు సంబంధించి సుమారు 10 వేల మందికి పైగా పట్టాలు ఇచ్చాం. – శ్రీనివాసరావు, ఏఈ హౌసింగ్, కొత్తపల్లి

మా ఇల్లు పూర్తయ్యింది



జగనన్న కాలనీలో నిర్మించిన ఇంటిలోనే నివసిస్తున్నాం. జగనన్న చేసిన మేలు ఎప్పటికీ మరువలేం. నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఈ కాలనీలో ఇల్లు మంజూరు చేయడం చాల ఆనందంగా ఉంది. – కమల లక్ష్మి, అమరవిల్లి

ప్రారంభోత్సవానికి పరుగులు

- ఏలేరు కాలువపై పూర్తైన వంతెన
- భారీ వాహనాల రాకపోకలు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై వంతెన పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. బ్రిటిష్ వారి కాలంలో సుమారు 150 ఏళ్ల క్రితం ఏలేరు కాలువపై వంతె నిర్మించారు. ఎడ్లబళ్ల రాకపోకలు జరిగేలా మాత్రమే వంతెన నిర్మించడంతో ఈ వంతెనను ఇరుకు వంతెనగా పిలిచేవారు. సుమారు మూడేళ్ల క్రితం టిప్పరు వెళ్తున్న సమయంలో వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. దాంతో అప్పటి నుంచి పిఠాపురానికి రాక పోకలు నిలిచిపాయాయి. ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కృషిమేరకు వంతెన నిర్మాణానికి రూ.కోటి మంజూరు అయ్యాయి. దాంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించి వంతెన సమీపంలో ఏలేరు కాలువపై తాత్కాలిక అప్రోచ్ రోడ్డు వేయడంతో ఆటోలు, కార్లు రాక పోకలకు మార్గం ఏర్పడింది. భారీ వాహనాల రాకపోకలతో అప్రోచ్ రోడ్డు అనేక పర్యాయాలు శిథిలమైంది. దాంతో పిఠాపురానికి చెందిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఏలేరు కాలువపై వంతెన పనులు పూర్తి కావడంతో ఈ వంతెన మీదుగా భారీ వాహనాల రాక పోకలు శుక్రవారం నుంచి జోరందుకున్నాయి. వంతెన అప్రోచ్‌కు రెయిలింగ్ నిర్మించి వంతెనను ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

లఘుచిత్రం ప్రారంభం

కొత్తపల్లి: నిరుద్యోగ యువత ఉపాధి లేక నిరుత్సాహం చెందకుండా తనలో దాగి ఉన్న నైపుణ్యతతో తన సత్తాను చాటి ఎదుటి వారికి ఆదర్శంగా నిలిచే ఒక యువకుడి కథను కథలి షార్ట్ ఫిలింను శుక్రవారం కొత్తపల్లిలో వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు ప్రారంభించారు. ఈ షార్ట్ ఫిలింకు ఉప్పాడకు చెందిన సూరాడ ప్రతాప్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. నటుడిగా గరికిన సతీష్, కెమెరా మేన్‌గా చిత్రాడ జగ్గారావు, కథానాయకుడుగా సిద్ధాంతపు బెన్‌జాన్సన్ నటిస్తున్నారు. సీఎస్ఎన్ క్రియేషన్‌లో షార్ట్ ఫిలిం చిత్రీకరిస్తున్నారు.



షార్ట్‌ఫిలింకు కెమెరా స్విచ్ ఆన్ చేస్తున్న వైస్ ఎంపీపీ దొరబాబు

ప్రజా సహకారంతో అభివృద్ధి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ

పిఠాపురం: పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పట్టణ వాసులకు సూచించారు. గురువారం ఐదో వార్డు సచివాలయ పరిధి 11వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న పథకాలను వివరించి అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి పారిశుధ్య సమస్య తీవ్ర ఆటంకంగా ఉందని, ప్రజలు సహకరిస్తే ఆ సమస్యను అధిగమించవచ్చన్నారు. పథకాల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావులేదని అన్నీ ఆన్‌లైన్‌లో ఎవరి ప్రమేయం లేకుండా అందేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఒక వేళ ఎవరికైనా అందకపోతే అక్కడికక్కడే అధికారులను పిలిచి అర్హులైతే అందించేలా ఆదేశాలిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన రూ.20 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరేలా పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- జి.రాగంపేటలో గడప గడపకూ

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా శుక్రవారం మండలంలోని జి.రాగంపేటలో ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలి అనురాధ, కన్వీనర్ కేతఈడీ రాజు, ఎలుబండి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబుతో కలసి గడప గడపకూ తిరిగి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఎంపీడీఓ హిమమహేశ్వరితో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పంచారామక్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు కిటకిటలాడారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



పంచారామ క్షేత్రంలో స్వామి వారు

గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణానికి సహకరించండి

- ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి
- భూ సేకరణపై అవగాహన సదస్సు

పిఠాపురం: ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు నిర్మించనున్న గ్యాస్ పైపులైన్ నిర్మాణానికి సహకరించాలని ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి రైతులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయాల్లో శుక్రవారం కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గొల్లప్రోలు మండలంలో గొల్లప్రోలు, చేబ్రోలు, లక్ష్మీపురం, విజయనగరం గ్రామాల్లో 11 కిలో మీటర్ల మేర గ్యాస్ పైపులైన్ నిర్మిస్తున్నారని, దీని కోసం 55 ఎకరాల భూమి అవసరం అవుతుందని ఆమె తెలిపారు. నిర్మాణం వినియోగించుకునే హక్కు పద్ధతిలో జాతీయ ప్రాజెక్టు పైపులైన్ నిర్మాణం జరుగుతుందని రైతులకు వివరించారు. పిఠాపురం మండలంలో నవఖండ్రవాడ, మాధవపురం గ్రామాల్లో 3.75 కిలోమీటర్ల మేర గ్యాస్ పైపులైన్ నిర్మాణం జరుగుతోందన్నారు. దీని కోసం 12.30 ఎకరాల భూమి అవసరం అవుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు , గ్యాస్ పైపులైన్ నిర్మాణ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వ్యతిరేకించిన రైతులు : జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు ఆధ్వర్యంలో రైతులు నిర్మాణం వినియోగించుకునే హక్కు పద్ధతిలో భూమి సేకరణను వ్యతిరేకించారు. తమ భూములను భూసేకరణ పద్ధతిలో మాత్రమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్మించిన పైపులైన్‌కు తవ్విన గోతులు ఇప్పటికీ పూడ్చలేదని దీంతో పంటల సాగుకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని రైతులు అధికారులకు వివరించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.



అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

ఆహ్లాదంగా ఫిల్టర్ బెడ్ ప్లాంటు

సామర్లకోట: ఫిల్టర్ బెడ్ ప్లాంటు ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా తయారు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్ ప్లాంటులో కొబ్బరి మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఫిల్టర్ బెడ్ ప్లాంటు తుప్పలతో నిండి ఉండేదని, ప్రస్తుతం ప్లాంటులోకి రోడ్డు నిర్మాణంతో పాటు ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రానున్న వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ మేరకు ప్రతి రోజు కమిషనర్, డీఈలు ఫిల్టర్ బెడ్ ప్లాంటు పరిశీలించాలని సూచించామన్నారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, స్వయంభారపు వీరభద్రరావు, నేతల హరిబాబు, మైనార్టీ కో ఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్ ప్లాంటులో కొబ్బరి మొక్క నాటిన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు తదితరులు

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దొరబాబు

పెద్దాపురం: మండలంలో చదలాడ గ్రామంలో శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఒబిలిశెట్టి పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గతమెన్నడూ లేవన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిచ్చి ప్రజారోగ్య సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో మంజూరైన 18 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, ఉపాధి హామీ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నియామక పత్రాన్ని ఆయన పంపిణీ చేశారు. కాకినాడ మెడికవర్, రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీటీసీలు శైల గణేష్, కుంచే బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉరుస్ ఉత్సవం



తొమ్మిది మూరల సాహెబ్ సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దొరబాబు తదితరులు



దర్గా వద్దకు గంధాన్ని తీసుకువస్తున్న ముస్లింలు

- ముస్లింలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: మత సామరస్యానికి ప్రతీకగా పెద్దాపురం తొమ్మిది మూరల సాహెబ్ ఉరుస్ ఉత్సవం దోహదపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక షేక్ హజరత్ పాచ్చా ఔలియా (తొమ్మిది మూరల సాహెబ్) సమాధి వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన ఉరుస్ (గంధోత్సవాన్ని) హౌసింగ్ చైర్మన్ దొరబాబు ప్రారంభించారు. ముస్లిం పెద్దలు అబ్దుల్ గఫర్‌ఖాన్, ఎండీ లాయక్ అలీ, ఎంఎల్ అలీ నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన భాగస్వాములై మసీద్‌లోని సాహెబ్ సమాధి వద్ద నివాళులర్పించారు. దొరబాబు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఐక్యంగా ఏటా ఉరుస్ ఉత్సవం జరుపడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యమిచ్చి సీఎం జగన్ ఇమామ్‌లకు జీతాలతో పాటు ముస్లింలను అన్ని విధాల ఆదుకుంటున్నారన్నారు. ముస్లిం సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని దొరబాబు అన్నారు. పెద్దాపురం రాజా వారి వద్ద సైనికుడిగా పని చేసిన తొమ్మిది మూరల హజరత్ షా రహమ్‌తుల్లా అల్లా ద్వారా మహిమను పొందిన వ్యక్తిగా ప్రజలు పూజించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎండీ సతార్ ఇంటి వద్ద నుంచి గుర్రపు గంధాన్ని ఊరేగింపుగా సమాధి వద్దకు తీసుకురాగా సాహెబ్ సమాధిపై గంధాన్ని పూసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మిమిక్రీ, మ్యూజికల్ నైట్, ఖవ్వాలి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ముస్లింలు, అధిక సంఖ్యలో మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

మిస్టర్ అక్కుగా అవినాష్



అవినాష్‌ను అభినందిస్తున్న దృశ్యం

నాగమల్లితోట జంక్షన్: పీఆర్ కళాశాల విద్యార్థి శివదుర్గ అవినాష్ ఆక్కు మిస్టర్ యూనివర్శిటీ టైటిల్ గెలుచుకున్నాడు. నన్నయ వర్సిటీ బెస్ట్ ఫిజిక్ పురుషుల పోటీలు స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో శుక్రవారం నిర్వహించారు. వర్శిటీ పరిధిలోని 15 కళాశాలల నుంచి 40 మంది హాజరయ్యారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మీడియా ఆఫీసర్ ప్రసాద్‌రాజు ప్రారంభించారు. విజేతలకు వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు బహుమతులు అందజేశారు.

జాతీయ పురస్కారానికి జీపీటీ విద్యార్థుల ఎంపిక

బాలాజీచెరువు: నాగపూర్ యూనివర్సిటీ నాగపూర్‌లో నిర్వహించిన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఐపీసీ–2023లో కాకినాడ మహిళా పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలకు చెందిన డీ–ఫార్మసీ విద్యార్థులు కేశవరపు సాయి నిఖిత, 91శాతం, కంకటాల పద్మనాగ హైమ 89 శాతం మార్కులతో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి కేకే ఆచార్జీ మెమోరియల్ ఇండియన్ ఫార్మాసిస్ట్ అవార్డు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ టీవీ రాజశేఖర్, ఫార్మసీ విభాగాధిపతి కిషోర్‌కుమార్ అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.రెండు లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.జానకి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన కొవ్వూరి నారాయణ రెడ్డి నుంచి రమణయ్యపేట చెందిన కేశవరపు సత్య శ్రీనివాస్ 2017లో రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2020లో రూ.2లక్షల చెక్కు ఇచ్చాడు. చెక్కును బౌన్స్ కావడంతో పై శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

సామర్లకోట: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తుని అగ్నిమాపక అధికారి రామకృష్ణరాజు అన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఆపద మిత్రల ఆరో బ్యాచ్ శిక్షణలో భాగంగా రెండో రోజు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను రక్షించడానికి ఆపద మిత్రలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇంధనం నిల్వ చేసిన సమయంలో ఒత్తిడికి వేడి రూపంలో మంటలు వ్యాపిస్తాయని తెలిపారు. వివిధ రకాల అగ్నిప్రమాదాలపై శిక్షణ ఇచ్చారు. కార్బన్ డయాక్సైడ్ ద్వారా మంటలు అదుపు చేయవచ్చునన్నారు. అలాగే డ్రై కెమికల్ పౌడర్ ద్వారా మంటలు అదుపు చేసే విధానంపై అవగాహన కల్పించారు. విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఎస్‌డీఆర్ఎస్ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, మేనేజరు పి.శ్రీనివాసులు పర్యవేక్షించారు.



ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక అధికారి

నేడు యానాం రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

కరప: చొల్లంగి అమావాస్య తీర్థంతో కాకినాడ–యానాం రోడ్డులో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కరప మండలం మొండి వద్ద శుక్రవారం బాలాత్రిపుర సుందరి సమేత సంగమేశ్వరస్వామి తీర్థం జరుగుతుండడంతో కాకినాడ నుంచి అమలాపురం వైపు, అమలాపురం నుంచి కాకినాడవైపు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్ 216 రహదారిలో మళ్లిస్తున్నట్టు తెలిపారు. కాకినాడ నుంచి అమలాపురం వైపు వెళ్లే వాహనాలు జగన్నాథపురం, అన్నమ్మఘాటీ సెంటర్, తూరంగి, నడకుదురు, గురజనాపల్లి, చొల్లంగి, చొల్లంగిపేట మీదుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఎన్‌హెచ్ 216 చేరుకుని అక్కడ నుంచి అమలాపురం వైపు మళ్లిస్తున్నట్టు తెలిపారు. అలాగే అమలాపురం నుంచి కాకినాడ వైపు వచ్చే వాహనాలు పటవల వద్ద జాంకాయల తూము, జి.వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు, నడకుదురు, అన్నమ్మఘాటీ సెంటర్ మీదుగా కాకినాడ చేరుకుంటాయన్నారు. ఈ ట్రాఫిక్ మళ్లింపు శనివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమలులో ఉంటుందని అన్నారు. వాహనచోదకులు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

23న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో 23వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. 9 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, యాక్సిస్ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ ఆఫీసర్, సెవెన్‌స్టార్ హాస్పటల్‌లో స్టాఫ్‌నర్సు, ఓపీ సర్వీస్, ల్యాబ్ టెక్నీషియన్, ఫ్రంట్ డెస్క్ ఆఫీసర్, హుండాయ్ మోబిస్‌లో టెక్నీషియన్స్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్‌కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్ నీడ్స్.కామ్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటీవ్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్, డ్రైవర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీడీ లచ్చారావు వివరించారు. అలాగే డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 40 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ. 20 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ జెరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.